రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త





ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

## ప్రతి ఫిర్యాదుకూ తక్షణ పరిష్కారం

ప్రజావాణిలో కలెక్టర్ ఆదేశం 2

# కనుల పండువగా బీరప్ప స్వామి కళ్యాణం



**పూడూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** పూడూరు మండలం పరిధిలోని బార్లవుపల్లి గ్రామ శివారులో వెలసిన శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ బీరప్పస్వామి కళ్యాణం కనుల పండువగా జరిగింది. రెండు రోజుల పాటు జరుగుతున్న బీరప్ప దేవాలయ ఉత్సవాల సందర్భంగా చివరిరోజు బీరప్పస్వామివారికి గ్రామంలోని మహిళలు మధ్యాహ్నం పలు రకాల పిండివంటలు తయారుచేసి నైవేద్యం సమర్పించేందుకు ఒగ్గు కళాకారులు (బీర్లవారు)డోలు వాయిద్యాల మధ్య వీధివీధిలో కలియ తిరుగుతూ బోనాలతో గ్రామం నుండి దేవాలయం వరకు భారులు తీరారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పోతురాజుల విన్యాసాలు, శివ సత్తుల పూనకాలు భక్తులను ఆలరింపజేశాయి. అనంతరం ఒగ్గు కళాకారులు (బీర్లవారు) శ్రీ బీరప్పస్వామివారి జీవిత చరిత్రను కళారూపాలు (ఒగ్గుకథల) ద్వారా తెలియజేస్తూ, భాజా భజంత్రీలు, డోలు వాయిద్యాల మధ్య స్వామివారి కళ్యాణం చూడముచ్చటగా నిర్వహించారు. చుట్టు ప్రక్కల గ్రామాలవారు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో గ్రామం అంతా శ్రీ బీరప్ప స్వామివారి నామ స్మరణతో మార్మోగింది.

ప్రజావాణిలో

# సమస్యల వెల్లువ

- 177 దరఖాస్తుల స్వీకరణ
- సమస్యల పరిష్కారంలో నిరక్ష్యం వద్దు
- కలెక్టర్ మనుచౌదరి ఆదేశం
- బోనస్ చెల్లించాలని రైతు సంఘం నేతల వినతి
- ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పేదల వేడుకోలు



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి ప్రజలు భారీగా తరలివచ్చారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు విన్నవించుకోవడంతో కలెక్టరేట్ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మను చౌదరితో పాటు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్ఓ చంద్రావతి ప్రజల నుండి వినతులను స్వీకరించారు.

**హౌసింగ్‌కే అధికం**

ఈ ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 177 దరఖాస్తులు అందాయి. అందులో ప్రధానంగా హౌసింగ్‌కు 49 దరఖాస్తులు వైద్య, ఆరోగ్య శాఖకు 30 దరఖాస్తులు, విద్యుత్ శాఖకు 21 దరఖాస్తులు అందాయి.

**అన్నదాతలకు ఏది ఆసరా?**

గత ఏడాది యాసంగికి సంబంధించి సుమారు 866 మంది రైతులకు రావాల్సిన సన్నవడ్ల బోనస్ (రూ. 500) ఇంకా అందలేదని జిల్లా రైతు అధ్యక్షులు ఎం. సంజీవరెడ్డితోపాటు పలువురు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బోనస్ నగదు చెల్లించాలని వారు కోరారు. అలాగే, విధుల నిర్వహణలో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలని ఏఐటీయూసీ నాయకులు, సెకండ్ ఏఎన్ఎంలు కలెక్టరుకు విన్నవించారు.

**దరఖాస్తులు తిరస్కరిస్తే.. కారణాలు చెప్పండి**

అనంతరం కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలను ఎలాంటి జాప్యం లేకుండా, నిరక్ష్యం వహించకుండా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఒకవేళ ఏదైనా దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, అందుకు గల కారణాలను తప్పనిసరిగా అర్జీదారులకు వివరించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హోటళ్ల వంట ధరల మంట



ఓ హోటల్‌లో కట్టెల పొయ్యిపై వండుతున్న కార్మికులు



మూలనపడిన గ్యాస్ స్టవ్‌లు

- గ్యాస్ కృత్రిమ కొరతతో యజమానుల ఇష్టారాజ్యం..
- పెరిగిన కట్టెల పొయ్యిల వినియోగం
- అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు.. ప్రతి వస్తువుపై అదనపు వసూళ్లు
- సామాన్యుడి జేబుకు చిల్లు
- ఫలితమివ్వని టాస్క్‌ఫోర్స్ దాడులు

**(వికారాబాద్ జిల్లా ప్రతినిధి- ప్రభాతవార్త)**

జిల్లాలో గ్యాస్ ఏజెన్సీలు సృష్టిస్తున్న కృత్రిమ కొరత సామాన్య వినియోగదారుడిపై పెనుభారంగా మారింది. గ్యాస్ కొరతను సాకుగా చూపుతూ హోటల్ యజమానులు తినుబండారాల ధరలను అమాంతం పెంచేశారు. అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు ప్రతి వస్తువుపై అదనపు వసూళ్లకు పాల్పడుతుండటంతో సామాన్యులు లబోదిబోమంటున్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నా, నిల్వలపై భరోసా ఇస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు.

**పెరిగిన ధరల భారం**

ప్లేట్ ఇడ్లీ రూ. 30 నుండి రూ. 50కి చేరింది. దోశ, వడ తదితర అన్ని వంటకాలపై అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు.

**తగ్గుతున్న మెనూ :** గ్యాస్ కొరత కారణంగా జిల్లాలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. గ్యాస్ అందక సాయంత్రం పూట చాలా హోటళ్లు, టిఫిన్ సెంటర్లు మూతపడుతున్నాయి. తక్కువ గ్యాస్ వినియోగించే రెగ్యులర్ వంటకాలను మాత్రమే వండుతున్నారు. స్పెషల్ ఐటమ్స్ అందించడం తగ్గించేశారు. బార్లు, రెస్టారెంట్లలోనూ కొత్త మెనూ కార్డులు దర్శనమిస్తున్నాయి.

**ఇరుకు గదుల్లో పొగతో పరార్ :** ఇరుకైన గదుల్లో కట్టెల పొయ్యిల వల్ల వచ్చే పొగకు భయపడి వినియోగదారులు బయటకు వెళ్లిపోతున్నారని యజమానులు ఆందోళన చెందుతున్నారు.

**కట్టెల వాడకమే లాభసాటా?**

గ్యాస్ దొరకడం లేదని సాకు చూపుతున్న యజమానులు, వాస్తవానికి లాభాల వేటలో పడ్డారు. మార్కెట్ విశ్లేషణ ప్రకారం గ్యాస్ కంటే కట్టెల వాడకమే యజమానులకు లాభసాటిగా ఉంది. కమర్షియల్ సిలిండర్ ధర ఒక రీఫిల్లింగ్‌కు రూ. 2,350 ఖర్చవుతుండగా.. ఒక క్వింటాలు కట్టెల ధర కేవలం రూ. 600 మాత్రమే. 150 మందికి వడ్డించే హోటల్‌కు రోజుకు ఒక సిలిండర్ లేదా ఒక క్వింటాలు కట్టెలు సరిపోతాయి. కట్టెల ధర తక్కువగా ఉన్నప్పటికీ, హోటళ్లలో వంటకాల ధరలు తగ్గించకపోగా రెట్టింపు చేయడం గమనార్హం.

**అందుబాటులో ఆధునిక కట్టెల పొయ్యి**

నెల రోజులుగా కమర్షియల్ గ్యాస్ సరిగ్గా అందకపోవడంతో ప్రత్యామ్నాయం వైపు హోటల్ యజమానులు ఆలోచిస్తున్నారు. ఇటీవల కట్టెల పొయ్యిలో ఆధునిక విధానం అందుబాటులోకి వచ్చిందని చెబుతున్నారు. దాని ధర 10 వేల వరకు ఉంటుంది. అందులో కట్టెలు వేస్తే మంట హెచ్చు తగ్గులను నియంత్రించవచ్చని చెబుతున్నారు. ఈ క్రమంలో హోటళ్లలో ధరలు పెంచక తప్పడం లేదని అంటున్నారు.

**పెళ్లి భోజనాలపైనా ప్రభావం**

గ్యాస్ కొరత ప్రభావం శుభకార్యాలపై కూడా పడింది. గ్యాస్ లభించడం లేదని క్యాటరర్లు తెగేసి చెప్పడంతో, పెళ్లి భోజనాల్లో తినుబండారాల సంఖ్యను కుదిస్తున్నారు. 2 వేల మందికి భోజనాలు అనుకున్న వారు, ఖర్చు తగ్గించేందుకు వెయ్యి మందికే పరిమితం చేస్తున్నారు. ముఖ్యంగా గ్యాస్‌పై తయారు చేసే స్వీట్ల తయారీని తగ్గించేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా స్పందించి గ్యాస్ కృత్రిమ కొరతను నివారించకపోతే, సామాన్యుడిపై ఈ ధరల భారం మరింత పెరిగే ప్రమాదం ఉంది.

పత్రికలలో వచ్చే ప్రతికూల కథనాలపై

# స్పందించాలి

జిల్లా అధికారులకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** జిల్లా లో ప్రజావాణి పిర్యాదులు, ప్రతి రోజు న్యూస్ పేపర్‌లలో వచ్చే ప్రతికూల వార్తలపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులు వెంటనే పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్సు హాలు నందు అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్బంగా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని, ప్రజల నుండి వచ్చిన ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖలు సమగ్రంగా పరిశీలించి, వేగవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజావాణి ఫిర్యాదులను ఎన్ఐసి లో అప్డేట్ చేసి పంపిస్తామన్నారు. లాగిన్‌లో చెక్ చేసి మీ శాఖలకు సంబంధించిన ధరకాస్తులకు అప్డేట్ చేయాలనీ తెలిపారు. వ్యవసాయం, పంచాయతి రాజ్, (అక్రమ ఇసుక రవాణా) ఎడి మైన్స్, అటవీ శాఖ, ఇంజనీరింగ్ శాఖలు , విద్యుత్, అంగన్వాడి, విద్యా శాఖ, మున్సిపాలిటీలు, ఆర్అండ్‌బి, శాఖలకు సంబంధించిన పెండింగ్ దరకాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

ఇటీవలి కాలంలో ప్రతిరోజు దినపత్రికల్లో ప్రచురితమైన ప్రతికూల వార్తలపై కూడా ప్రభుత్వం స్పందిస్తోందని, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. వార్తా పత్రికల్లో ప్రచురితమైన అంశాలపై సంబంధిత అధికారులు వెంటనే నివేదికలు డిపిఆర్ఓ ద్వార పంపించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ మంగి లాల్, డీఆర్డీఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్‌లు, తహసిల్దార్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.



మూడుచింతలపల్లి మున్సిపాల్టీ సమావేశంలో పాల్గొన్న చైర్మన్ జాము రవి తదితరులు

# రూ.6.7 కోట్ల వ్యయంతో బడ్జెట్‌కు గ్రీన్‌సిగ్నల్

**శామీర్‌పేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** శామీర్పేట సమీపంలోని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన అంచనా బడ్జెట్‌ను సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశంలో ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి అధ్యక్షతన కార్యాలయంలో నిర్వహించిన ఈ సభలో మొత్తం రూ. 6 కోట్ల 70 లక్షల 39 వేల వ్యయంతో కూడిన బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ బడ్జెట్ వివరాలను పరిశీలిస్తే, ప్రారంభ నిల్వ (ఓపెనింగ్ బ్యాలెన్స్) రూ. 2 కోట్ల 19 లక్షల 89 వేలుగా ఉండగా, ఇంటి పన్నుల ద్వారా రూ. 3 కోట్ల 50 లక్షలు, నాన్ ట్యాక్స్, ఇతర పన్నుల ద్వారా రూ. 1 కోటి 50 వేల ఆదాయాన్ని అంచనా వేశారు. వ్యయం విషయానికి వస్తే, సిబ్బంది వేతనాల కోసం రూ. 3 కోట్ల 68 లక్షల 70 వేలు, శానిటేషన్ మరియు ఆఫీస్ నిర్వహణ ఖర్చులకు రూ. 1 కోటి 51 లక్షల 15 వేలు, అలాగే క్యాపిటల్ ఖర్చుల నిమిత్తం రూ. 1 కోటి 13 లక్షలను కేటాయించారు. అన్ని ఖర్చులు పోను సుమారు రూ. 37 లక్షల 54 వేల మిగులు బడ్జెట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా చైర్మన్ జాము రవి మాట్లాడుతూ, మున్సిపాలిటీని దశలవారీగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు కౌన్సిలర్లు అందరూ సహకరించాలని కోరారు. బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించినందుకు కౌన్సిల్ సభ్యులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పవన్ కుమార్, వైస్ చైర్మన్ ఎం. శశిరేఖతో పాటు కౌన్సిలర్లు నీరజ్ గౌడ్, నవీన్ నాయక్, పాపిరెడ్డి, ప్రియాంక, సరిత, రమేశ్, జ్యోతి, గోవర్ధన్ రెడ్డి, శ్రీలత, డి. లత, ఆర్. లత, ప్రభాకర్, అజయ్ కుమార్, మాధవి, మోనిక, రాజు, విష్ణువర్ధన్ రెడ్డి, జంగారెడ్డి, స్వప్న, శ్రీవాణి, మల్లేశ యాదవ్, మహేశ్వరి, మేనేజర్ ఉష, ఏఈలు రాజేశ్వర్ రెడ్డి, గౌతమి, డీఈ స్ఫూర్తి, శానిటేషన్ ఇన్స్పెక్టర్ మోహన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# 15,17 తేదీలలో డబుల్ బెడ్‌రూమ్ వాణిజ్య దుకాణాల బహిరంగ వేలం

## అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని వివిధ డబుల్ బెడ్రూమ్ కాలనీలలో నిర్మించిన వాణిజ్య దుకాణాలను విక్రయించడానికి ఈ నెల 15, 17 తేదీలలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ వేలం ద్వారా వచ్చే నిధులను ప్రత్యేక కార్పస్ ఫండ్‌గా జమ చేసి, ఆ నిధులపై వచ్చే వడ్డీని సంబంధిత కాలనీల్లో మురుగునీటి వ్యవస్థ, వీధి దీపాలు, పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారుల మరమ్మతులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు వెచ్చించనున్నారు.



జిల్లాలోని వివిధ ప్రాంతాలలో ఉన్న దుకాణాలకు సంబంధించి విస్తీర్ణం, ధరలను అధికారులు ఖరారు చేశారు. చైతన్యనగర్‌లో 14 దుకాణాలకు అడుగుకు రూ. 27 వేలు, చెర్లపల్లిలో 11 దుకాణాలకు అడుగుకు రూ. 3,200, శ్రీరామ్ నగర్‌లో 30 దుకాణాలకు రూ. 3,300, కొర్రెములలో 22 దుకాణాలకు రూ. 2,000, రాంపల్లిలో 80 దుకాణాలకు గ్రౌండ్ ఫ్లోర్ రూ. 3,000 మరియు ఫస్ట్ ఫ్లోర్ రూ. 2,500 ధర నిర్ణయించారు. అలాగే తూంకుంటలో 41 దుకాణాలకు రూ. 3,920, మురహరిపల్లిలో 47 దుకాణాలకు రూ. 2,450, అహ్మదూడలో 156 దుకాణాలకు రూ. 2,380, కైసర్ నగర్‌లో 19 దుకాణాలకు రూ. 3,500, దుండిగల్‌లో 273 దుకాణాలకు రూ. 2,800, బాచుపల్లిలో 79 దుకాణాలకు రూ. 3,900, నిజాంపేట్‌లో 120 దుకాణాలకు రూ. 3,900 చొప్పున ధరలను నిర్ణయించారు. ఈ వేలంలో పాల్గొన దలచిన వారు రూ. 35,000 ఈఎండి మొత్తాన్ని ఏదైనా జాతీయ బ్యాంకు నుంచి జిల్లా కలెక్టర్ మేడ్చల్ మల్కాజిగిరి పేరు మీద డిడి తీయాల్సి ఉంటుంది. జిల్లా కలెక్టర్, హౌజింగ్ ఈడి ఆదేశాల మేరకు ఈ వేలం ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు మరిన్ని వివరాల కోసం హౌజింగ్ అధికారులను 8712032821, 8712032718, 7995073744 లేదా ఏఈను 9849902699 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

మూడు దశాబ్దాల

# సేవా యజ్ఞం

ఆమనగల్లులో దాహార్తిని తీరుస్తున్న సాయి భక్తులు

**ఆమనగల్లు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** ఎండలు మండుతున్నాయి.. గొంతులు ఎండుతున్నాయి.. కానీ ఆమనగల్లు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు మాత్రం ఆ ఆవేదన లేదు. ఎందుకంటే అక్కడ మూడు దశాబ్దాలుగా నిరంతరాయంగా సాగుతున్న ఒక సేవా చలివేంద్రం వారి దాహాన్ని తీరుస్తోంది.

**32 ఏళ్ల అప్రతిహత సేవ**

ఒక్క ఏడాది కాదు.. రెండు ఏళ్లు కాదు.. ఏకంగా 32 ఏళ్లుగా ప్రతి వేసవిలోనూ ఇక్కడ చలివేంద్రాన్ని నిర్వహిస్తూ సత్యసాయి సేవా సమితి భక్తులు తమ నిస్వార్థ భక్తిని చాటుకుంటున్నారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులకు ఈ కేంద్రం ఒక వరంలా మారింది. ఫిల్టర్ వాటర్ కొనుగోలు చేసి, మట్టి కుండల్లో చల్లబరిచి స్వచ్ఛమైన నీటిని అందిస్తున్నారు. బస్సు దిగలేని స్థితిలో ఉండే డ్రైవర్లు, కండక్టర్ల వద్దకు భక్తులే స్వయంగా వెళ్లి మంచినీరు అందించడం వారి సేవా నిరతికి నిదర్శనం.

**అంబలి, మజ్జిగ పంపిణీ**

కేవలం మంచినీరు మాత్రమే కాకుండా, అప్పుడప్పుడు అంబలి, మజ్జిగను కూడా పంపిణీ చేస్తూ ప్రజల మనసు గెలుచుకుంటున్నారు. ఖర్చు, శ్రమతో కూడుకున్న పని అయినప్పటికీ, వేలాది మంది గొంతు తడపడంలో ఉన్న తృప్తి ముందు మరేదీ సాటిరాదని ఈ భక్తులు నిరూపిస్తున్నారు.

**ఎన్ని అవరోధాలు వచ్చినా కొనసాగిస్తాం**

సత్యసాయి బాబా చూపిన సేవా మార్గమే తమకు స్ఫూర్తి అని సమితి కన్వీనర్ దొంతు శ్రీను, సీనియర్ సభ్యులు ఆమనగంటి సంజీవకుమార్ చెబుతున్నారు. మండు వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామన్నారు. ఎన్ని అవరోధాలు వచ్చినా వెనుకడుగు వేయకుండా ఈ సేవను భవిష్యత్తులో మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సత్యసాయి భక్తులు





రైతుల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

# అధైర్య పడకండి

## భూ సేకరణ ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం

### రైతులకు ఎంపి విశ్వేశ్వర్ రెడ్డి భరోసా

**పరిగి టౌన్ ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** పరిగి మండలంలోని కద్లాపూర్, రాపోల్ గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ కోసం సుమారు 1200 ఎకరాల భూసేకరణ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులోభాగంగా వారు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 14వ రోజుకు చేరుకుంది. చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి , వికారాబాద్ జిల్లా బిజెపి కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు, బిజెపి పరిగి అసెంబ్లీ ఇంచార్జ్ మారుతీ కిరణ్ బూనేటి తదితరులు సోమవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి రైతులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...భూముల కోసం జరుగుతున్న ఈ పోరాటంలో తాము రైతుల వెంట ఉంటామని భరోసా ఇచ్చారు. భూకేరణ ప్రయత్నాలు ఉపసంహరించుకునేలా ప్రభత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని స్పష్టం చేశారు. అధైర్య పడవద్దని, న్యాయం చేయటానికి బిజెపి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వెన్న ఈశ్వరప్ప. జానకిరామ్. మిట్ట పరమేశ్వర్ రెడ్డి, ముకుంద నాగేశ్వర్, హరికృష్ణ, మాజీ సర్పంచ్ కేశవులు, మల్లేష్ పటేల్, రైతు సంఘాల నాయకులు, మండలాల అధ్యక్షులు, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# పార్టీలు పక్కనపెట్టి పనిచేయండి

పట్టణ అభివృద్ధికి ఎంపి నిధులు కేటాయిస్తా- మూడుచింతలపల్లి కౌన్సిలర్లకు ఈటల దిశానిర్దేశం

**శామీర్పేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మూడుచింతలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని, పార్టీలకు అతీతంగా పని చేయాలని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మూడుచింతలపల్లి మున్సిపాలిటీకి చెందిన తొమ్మిది మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు, ఒక బిజెపి కౌన్సిలర్ తొలిసారిగా ఎంపిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధికి ఎంపి నిధులు కేటాయించాలని కౌన్సిలర్లు కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు.



మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్‌తో మూడుచింతలపల్లి మున్సిపాల్టీ కౌన్సిలర్లు, స్థానిక నేతలు

పట్టణ ప్రాశస్త్యాన్ని పెంచేలా అభివృద్ధి పనులు చేపట్టాలని, రాజకీయాలకు తావు లేకుండా ముందుకు వెళ్లాలని ఎంపి వారికి దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లను ఈ సందర్భంగా ఈటల రాజేందర్ సన్మానించారు. ఎంపీని కలిసిన వారిలో కాంగ్రెస్ కౌన్సిలర్లు ముద్దం పాపిరెడ్డి, కటికెల శ్రీవాణి వైద్యనాథ్, దోసకాయల లత వెంకటేశం, పెద్దిరెడ్డి శ్రీలత వెంకట్రెడ్డి, మెరిపాటి గోవర్ధన్ రెడ్డి, ఇర్రి స్వప్న రవీందర్ రెడ్డి, బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, రాజిగల్ల లత భూపాల్, పులి ప్రభాకర్, బిజెపి కౌన్సిలర్ ప్రియాంక శ్రీకాంత్ రెడ్డితోపాటు మూడు చింతలపల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి నేమూరి విష్ణుగౌడ్, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, బిజెపి నాయకులు మామిండ్ల అశోక్, మామిండ్ల శ్రీనివాస్ ఉన్నారు.

## తాండూరు అభివృద్ధికి సహకరించండి


నరేందర్‌రెడ్డిని కలిసిన బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి

**తాండూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కాంగ్రెస్ నాయకులు, ఆర్‌బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి రాజ్యసభ సభ్యులు వేం నరేంద ర్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీ వల రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వేం నరేం దర్‌రెడ్డని హైదరాబాద్‌లోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సంద ర్భంగా పలు రాజకీయ అంశాలను చర్చించారు. తాండూరు అభివృద్ధి, నిధుల కేటాయిం పుపై మాట్లాడారు. అంతేకాకుండా నామినేటెడ్ పోస్టులలో తాండూరుకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## కార్యకర్తలు ప్రజాసమస్యలపై దృష్టిపెట్టాలి


బిజెపి జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

**కీసర, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** బిజెపితోనే అభివృద్ధి చెందుతుందని నాగారం మున్సిపల్ మాజీ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. ఘట్ కసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ పరిధిలో బిజెపి అధ్యక్షులు కొండ బోయిన నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ జెండా లను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ 47 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో పార్టీ నాయకులు, కార్యకర్తల త్యాగాల వల్లే కేంద్రంలో బిజెపి అధికారంలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా బిజెపి అధికారంలోకి రావాలని ఆకాక్షిం చారు. రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో నాగారం డివిజన్‌ను బిజెపి కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలు ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మును గంటి సురేష్, జిల్లా ఉపాధ్యక్షులు శ్యాం సుందర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ, మా జీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్, డివిజన్ ప్రధాన కార్యదర్శులు జంగారెడ్డి, పి.వెంకటేశ్వర్ రావు, ఉపాధ్యక్షులు వల్లల శ్రీనివాస్‌గౌడ్, ఎలసాని నాగరాజు యాదవ్, కార్యదర్శి సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేశ అభివృద్ధే బిజెపి లక్ష్యం


మాట్లాడుతున్న సందీప్‌కుమార్

**పెద్దేముల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** దేశాభివృద్ధి, ప్రజాసంక్షేమమే బిజెపి ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యవర్గసభ్యులు సందీప్ కుమార్ అన్నా రు. సోమవారం పెద్దేముల్‌లో మం డల పార్టీ అధ్యక్షుడు వీరేశం అధ్వ ర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బిజెపి జెండా ఆవిష్క రించారు. ప్రధాని న రేం ద్ర మో డి నాయకత్వంలో పేదలకు గృహాలు, ఉచిత గ్యాస్ కనెక్షన్లు, రైతులకు ఆర్థిక సహాయం, ఉచిత వైద్యసేవలు, ప్రతి ఇంటికి తాగునీరు అందు తోందన్నారు. మండల ప్రధా న కార్యదర్శులు శివరాజ్, రాంరెడ్డి, హరీష్ గౌడ్, యాదయ్యగౌడ్, నర్సి ములు, రాజు, రవినాయక్, ప్రదీప్, అనం తి, మహ్మద్, రవి, పరిపూర్ణనందా, వెంకట్, ఆశోక్ పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


చెక్కులను అందజేస్తున్న నేతలు

**కుల్కచర్ల, ఏప్రిల్, 6 ప్రభాతవార్త:** సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ ఆంజనే యులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వివిధ గ్రామా ల బాధితులకు స్థానిక నాయ కుల తో కలిసి చెక్కులను అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య, రాంపూర్ సర్పంచ్ తిరుపతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే పేదల సొంతింటి కల సాకారం


ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాల్గొన్న నేతలు

**కుల్కచర్ల, ఏప్రిల్, 6 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుం దని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనంత సాగర్ గామంలో చిల్ల పద్మజ రాములుకు ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య, ప్రధానకార్యదర్శి గోపాల్ నాయక్, ఆంజిలయ్య గౌడ్, కుమ్మరి స్వామి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## దేశభక్తి, సిద్ధాంతాలు కల్గిన ఏకైక పార్టీ బిజెపి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** దేశభక్తితో పనిచేస్తున్న ఏకైక పార్టీ బిజెపియేనని మేడ్చల్ రూరల్ జిల్లా మీడియా కన్వీనర్ చలువాది ప్రవీణ్‌రావు అన్నారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్, ఎదులాబాద్‌లో సోమవారం బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా మండలశాఖ అధ్యక్షులు బస్వ రాజుగౌడ్ పలుచోట్ల పార్టీ పతాకాలను ఎగురవేశారు. దేశం ఫస్ట్ అనే సిద్ధాంతంతో అంత్యోదయ లక్ష్యంగా పనిచేస్తున్న పార్టీ బిజెపి అని సామన్య కార్యకర్త కూడా ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు. అవుషాపూర్‌లో శక్తికేంద్రం ఇంచార్జ్ భానుప్రసాద్‌యాదవ్, ఎదులాబాద్‌లో శక్తి కేంద్రం ఇంచార్జ్ గాయరు రాజేశ్‌లు పార్టీ జెండాలను ఎగురవేశారు.

ఈకార్యక్రమంలో నాయకులు ఎదుగని శ్రీరాములు, దళితమోర్చ జిల్లా అధ్యక్షులు కప్పరగళ్ల కరుణాకర్, మండల ప్రధానకార్యదర్శులు పోలు భాస్కర్‌గౌడ్, గొబ్బరి మన్యం, ఉపాధ్యక్షులు పాముకుంట్ల బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణయాదవ్, బెలే సురేష్, కార్యదర్శులు చింతికింది సుధాకర్, రమేశ్‌నాయుడు, ఎంబిసి జిల్లా కోకన్వీనర్ సాల్వేరు రఘు, జిల్లా రజక కోకన్వీనర్ బండిరాల సాయిరాం, శక్తి కేంద్రం ఇంచార్జ్‌లు బైనగారి సత్యనారాయణ, గాయరు రాజేశ, చీమల బానుయాదవ్, బూత్ అధ్యక్షులు ఏర్రోళ్ల మురళీకృష్ణ, గనుమల్ల పవన్‌కళ్యాణ్, చిలుకమర్రి మహేశ్, కాసుల వెంకటేశగౌడ్, ఏనుగు మచ్చేందర్‌రెడ్డి, రాచకట్ల శ్రీశైలం, గట్టుపల్లి మల్లేశ్, చిత్తరంజన్, సోమసాని రాజు తదితరులు పాల్గొన్నారు.


ఎదులాబాద్‌లో బిజెపి పతాకావిష్కరణలో పాల్గొన్న ప్రవీణ్‌రావు, భాస్కర్‌గౌడ్


అల్వాల్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా విష్కరణలో నేతలు


సుభాష్‌రోడ్డులో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న బీజేపీ తెలంగాణా రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీరె శ్రీకాంత్.


పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం సురేందర్


బిజెపి 46వ ఆవిర్భావ దినోత్సవం కూకట్‌పల్లిలో సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు


సంజీవరెడ్డి నగర్‌లో నిర్వహించిన బిజెపి ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో పాల్గొన్న బిజెపి పార్టీ శ్రేణులు


తార్నాక క్రాస్ రోడ్స్ వద్ద బిజెపి పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు


ఘాన్సీ బజార్‌లో జరిగిన బిజెపి వ్యవస్థాపక దినోత్సవంలో పాల్గొన్న డివిజన్ బిజెపి అధ్యక్షులు నితిన్ అగర్వాల్,బిజెపి నాయకులు


బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ చికోటి ప్రవీణ్

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

## ముగిసిన ఖేలో ఇండియా సైక్లింగ్ పోటీలు


విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** సైక్లింగ్ పోటీలో 20 రాష్ట్రాలకు చెందిన మహిళ క్రీడాకారిణులు పాల్గొని హోరాహోరీగా పోటీపడ్డారు. క్రీడా రంగంలో మహిళలకు ప్రోత్సాహం అందించే దిశగా నిర్వహిస్తున్న అస్మిత ఖేలో ఇండియా ఉమెన్స్ నేషనల్ సైక్లింగ్ లీగ్ పోటీలను నాగో ల్ డివిజన్ బండ్లగూడలో సోమవారం విజయవంతంగా ముగిశాయి.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన టీపీసీసీ ప్రధానకార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివా స్‌గుప్త విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను, బహుమతుల ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి పోటీలు నిరంతరం నిర్వహించాలన్నారు. మహిళలు క్రీడల్లో ముందుకు రావడం వారిలోని ప్రతిభకు పదును పెట్టిన వారవుతారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులకు అండగా నిలిచి ప్రోత్స హిస్తుందన్నారు. ఈ సైక్లింగ్ పోటీల్లో 20 రాష్ట్రాల నుండి (సౌత్, ఈస్ట్, వెస్ట్, నార్త్) బాలికలు సబ్‌జూని యర్, జూనియర్, ఎలైట్ విభాగాల్లో 120 మహిళలు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల అభినందించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు క్రీడాకారులకు ప్రోత్సాహ బహుమతులను అందజేసి వారిని మరింత ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ రెడ్డి, శంతన్, సెంట్రల్ వాటర్ బోర్డ్ రీజనల్ డైరెక్టర్ నల్లి జ్యోతికుమార్, వోబులేశ్ యాదయ్య, మేజర్ జనరల్ శ్రీనివాస్, నిర్వహకులు డాక్టర్ మాక్స్వెల్ శ్రీకాంత్, పాష శ్రీకాంత్, వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు క్రీడా ప్రముఖులు, నాయకులు, క్రీడాకారిణులు కోచ్‌లు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో వాణిజ్య సముదాయాల వేలం ఆపాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం


డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను సందర్శిస్తున్న నాయకులు

**దుండిగల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త** మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ఉన్న వాణిజ్య సముదాయాలను వేలం వేయొద్ద ని సిపిఎం జిల్లా కార్యదర్శి పి. సత్యం డిమాండ్ చేశారు. ఈ సముదాయాలను స్థానిక నివాసితులకే కేటాయించా లని కోరారు. సోమవారంసిపిఎం ఆధ్వర్యంలో దుండిగ ల్, డి. పోచంపల్లి ప్రాంతాల్లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సంద ర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసు కున్నారు. డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు అనేక మౌలిక సదుపాయాల సమస్యలను ఎదు ర్కొంటున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ఇండ్ల నిర్వహణ కోసం వాణిజ్య సముదాయాలను ఏర్పాటు చేసిందని, వాటి ద్వారా వచ్చే ఆదాయం లిఫ్ట్‌లు, ఇతర సౌకర్యాల నిర్వహ ణకు ఉపయోగపడాలని తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ సముదాయాలను వేలం వేయాలని ప్రయత్నించడం తప్పు అని విమర్శించారు.వేలంపాటను తక్షణమే నిలిపివేయాలని, లేదంటే ప్రజలను సమీకరించి పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే కలెక ర్ కార్యాలయం వద్ద ధర్నా, చలో అసెంబ్లీ కార్యక్రమాలు నిర్వహించి, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పిం చినట్లు తెలిపారు.అదేవిధంగా డబుల్ బెడ్ రూమ్ కాలనీల్లో మంచినీటి సమస్య పరిష్కారం, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ, అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాల, ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, జీరో కరెంట్ బిల్లు అమలు చేయాలని, స్మశానవాటిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు అశోక్, రాజశేఖర్, శంకర్, లింగస్వామి, సంతోష్ తదితరులు, అలాగే స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఇందిరాపార్కులో సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు : మంత్రి దామోదరం రాజనర్సింహ


ఇందిరాపార్కును సందర్శించిన వైద్య ఆరోగ్యశాఖామంత్రి దామోదరం రాజనర్సింహ

**ముషీరాబాద్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఇందిరాపార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపది కన చర్యలు తీసుకుంటానని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాకా మంత్రి దామోదరం రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమ వారం నెక్లెస్‌రోడ్డులో ఒక కార్యక్రమంలో పాల్గొన్న మం త్రి అక్కడ నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని వినాయక దేవాలయంకు వచ్చి, అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. అనంతరం ఇందిరాపార్కును మంత్రిగా కాకుండా ఒక సాధారణ వ్యక్తిగా సందర్శించిన రాజనర్సింహ, అక్క డ ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేశారు. ఈ సందర్భంగా ఇందిరాపార్కు వాకర్స్ పార్కులో ఉన్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. పార్కులో మరుగుదొడ్లు, మంచినీరు, ఓపెన్ జిమ్ పరికరాల రిపేర్ వంటి సమస్య లు పరిష్కరించాలని వాకర్స్, మంత్రిని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి జోనల్ కమీషనర్ మంగతాయారుకు ఫోన్‌చేసి, పార్కులో సమస్యలను తక్షణమే పరిష్కరించా లని ఆదేశించారు. ఆసియాఖండంలోనే అతి పెద్ద పార్కు లలో ఒక్కటైన ఇందిరాపార్కుకి ప్రతినిత్యం వేలాది మం ది వాకర్స్, వాకింగ్ చేస్తూ ఉంటారని, వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. ఆరోగ్యం మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్క రూ వాకింగ్‌తో పాటు వ్యాయామం చేయటం జీవితంలో భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఏ.సుధాకర్ యాదవ్, సభ్యులు నరేందర్, జయేందర్ బాబు, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## జస్టిస్ చంద్రకుమార్ రచనలు చైతన్యప్రవాహాలు! : పద్మశ్రీ కొలకలూరి ఇనాక్


జస్టిస్ చంద్ర కుమార్ రచించిన గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కొలకలూరి ఇనాక్

**చిక్కడపల్లి ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి. చంద్రకుమార్ రచనలు ప్రజాచై తన్య ప్రవాహాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ పేర్కొన్నారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో భారతీయ సాహిత్య అనువాద ఫౌండే షన్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి కళారత్న డా. బిక్కి కృష్ణ అధ్యక్షతన జస్టిస్ బి. చంద్రకుమార్ రాసిన "అమ్మకావా లినాన్న కావాలి" నవలావిష్కరణ సభ జరిగింది.ఈ సభలో ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా పా ల్గొని నవలను ఆవిష్కరించారు. భారతీయ కుటుంబ వ్యవస్థ గొప్పదనాన్ని, విడాకులవల్ల భార్యాభర్తలతో పా టు వారిపిల్లలు పడే మానసిక వేదనను రచయిత వేదన తో నవలగా శిల్పీకరించారని తెలిపారు. తెలుగు నవలా సాహిత్యంలో ఇదో గొప్ప నవలని ఇనాక్ కితాబిచ్చారు. న్యాయమూర్తిగా సంచలనాత్మక తీర్పులిచ్చిన జస్టిస్ బి. చంద్రకుమార్.. వృత్తి అనుభవ నేపథ్యంలో సజీవపాత్రల ను సృష్టించి నవలను ఒక స్ఫూర్తివంతమైన కళాఖం డంగా తీర్చి దిద్దారని వక్తలు కొనియాడారు. ఈ సభలో అతిథులుగా ప్రముఖ రచయితలు కె. వి. కృష్ణకుమారి, డా. పి. విజయలక్ష్మి పండిట్, డా. జెల్ది విద్యాధర్, డా. కోగంటి ఉషారాణి, డా. రాధాకుసుమ తదితరులు పాల్గొ న్నారు. రచయిత జసిస్ బి. చంద్రకుమార్ మాట్లాడు తూ.. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ ధ్వంసమై.. అవగా హనా రాహిత్యంతో సమాజంలో విడాకుల కేసులు పెరుగుతున్నాయని.. కుటుంబవ్యవస్థను ఎలా కాపాడుకో వాలో "అమ్మకావాలానాన్న కావాలా"నవలలో చిత్రించ డం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా డా. రాధా కుసుమ నిర్వహణలో జరిగిన కవిసమ్మేళనంలో నలభైమంది కవులు పాల్గొని తమ

### ఐదు దశాబ్దాల ఎర్రజెండా ప్రస్థానం లోకం పద్మ భాస్కరరావు


లోకం పద్మ , భాస్కరరావు దంపతులను సత్కరిస్తున్న ప్రముఖులు

**చిక్కడపల్లి ఏప్రిల్ 6 ( ప్రభాతవార్త ) :** ఆదర్శవంతమైన దాంపత్యం.. దానికి తోడు ఐదు దశాబ్దాల సుదీర్ఘ రాజకీ య, సామాజిక ప్రస్థానం.. అభ్యుదయ భావజాల వ్యాప్తి కోసం అంకితమైన జీవితం.. ఇదీ లోకం పద్మ భాస్కర రావు దంపతుల ప్రత్యేకత అని పలువురు వక్తలు కొని యాడారు. సోమవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎర్రజెండా నీడలో యాభై ఏళ్ళు శీర్షిక న నిర్వహించిన ఆత్మీయ సన్మాన సభ ఆరాధన కల్చరల్ అసోసియేషన్ , విశాలాంధ్ర, నవచేతన ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభకు సోమశిల తిరుపాల్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సభలో పాల్గొన్న తెలంగా ణ సాయుధ పోరాట యోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి , లోకం కృష్ణయ్య ,మాట్లాడుతూ కేవలం కుటుంబం కోసమే కాకుండా సమాజం కోసం బతికేవారే నిజమైన కమ్యూనిస్టులని, దానికి పద్మభాస్కరరావు దంపతులు నిదర్శనమని పేర్కొన్నారు.అనంతరం నిర్వాహకులు లో కం పద్మ భాస్కరరావు దంపతులను శాలువాలతో కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమం లో పి. రాజేశ్వరరావు, గోలి సీతారామయ్య, ఎస్. రాజా, పి. నారాయణ రెడ్డి, కనపర్తి బెన్ హర్, పల్లె నరసింహ, ఎస్. రామారావు, దేవరకొండ శ్రీను తదితర ప్రముఖులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపా రు. కార్యక్రమ నిర్వహణ బాధ్యతలను శివశంకర్ పర్యవే క్షి ంచగా, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు, పుస్తక ప్రేమికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## దళిత సమాజ సాధికారతకు కృషి చేసిన దార్శనికుడు జగ్జీవన్‌రాం

**జూబ్లీహిల్స్, ఎప్రిల్ 6, ప్రభాతవార్తః** దళిత సమాజ సాధికారతకు, అభ్యున్నతి కోసం అవిశ్రాంతం గా కృషి చేసిన గొప్ప దార్శనికుడు బాబు జగ్జీవన్‌రాం అని అంబేద్కర్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి అన్నారు. వర్సిటీ ప్రాంగణంలో సోమవారం 'ఆధునిక భారత దేశ అభివృద్ధిలో జగ్జీవన్‌రాం పాత్ర' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల కోసం, సమాన గౌరవం దక్కేలా తన జీవితాన్ని పోరాటాలకే అంకితం చేసిన నాయకుడని అన్నారు. దేశ అభివృద్ధికి ఆయన తీసుకున్న నిర్ణయాలు నాందిగా నిలిచా యన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సి పల్ ఆచార్య చింతకింది ఖాసీం మాట్లాడుతూ జగ్జీవన్‌రాం అనేక అవమానాలను ఎదుర్కొంటూ వాటిపై పోరాటాలు చేస్తూ ప్రజలను సంఘటితం చేసిన మహోన్నత వ్యక్తని అన్నారు. ఆయన ఆధునిక భారత రాజకీయాల స్వర్ణయు గానికి చెందినవారని, జాతీయ నాయకుడిగా, గొప్ప పార్లమెం టేరియన్‌గా, కేంద్ర మంత్రిగా అర్ధ శతాబ్దం పాటు ఆయన దేశ రాజకీయాల్లో కొనసాగారన్నారు.

కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎల్వీకే రెడ్డి, ఎస్సీ ఎస్టీ సెల్ లైజన్ ఆఫీసర్ డాక్టర్ బానోతు ధర్మ, ఆచార్య సుధారాణి, ఆచార్య ఆనంద్‌పవార్, ఆచార్య రబీంద్రనాథ్ సోలమన్, ఆచార్య పల్లవి, ఆచార్య వడ్డాణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రామచందర్ రావును కలిసిన బిజెపి నాయకులు


రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ రావును సత్కరిస్తున్న బిజెపి నాయకులు

**చార్మినార్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** బిజెపి 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు ఎన్.రామచందర్ రావును సోమవారం పాతబస్తీకి చెందిన మాజీ బిజెపి మైనార్టీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీతో పాటు పలువురు కలిసి సత్కరించారు.ఈ కార్యక్ర మంలో మైనార్టీ మోర్చ అధ్యక్షుడు జగన్ మోహన్ సింగ్, నాయకులు డాక్టర్ వసీముద్దీన్,వి.మురళీధర్ గౌడ్,షాబాజ్ పటేల్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆందోళన - చర్యలు కోరిన ఆకుల సతీష్

**నిజాంపేట్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

మెడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాం తం అవుతున్నాయని ఆకుల సతీష్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదు చేశారు.నిజాం పేట్ పరిధిలోని సర్వే నెం. 233/22, 24, 25, 26, 27లో సుమారు 14 ఎకరాల లావణ్య పట్టా భూమిని 1964-65లో రైతులకు కేటాయించగా, తరువాత ఎన్‌వోసీ లేకుండా 2008 లో వెంచర్‌గా మార్చి ప్లాట్లుగా విక్రయించినట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై 2010లో కలెక్టర్ భూమి మార్పులను రద్దు చేసినప్పటికీ, ప్రస్తుతం కొందరు వ్యక్తులు మళ్లీ ఆక్రమణకు పాల్పడుతూ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.ఇక ప్రగతి నగర్‌లోని సర్వే నెం. 186లో ప్రభుత్వ భూమిని వేరే సర్వే నెంబర్‌గా చూపించి అక్రమ రిజిస్ట్రేషన్లు చేసినట్లు, నిర్మా ణ అనుమతులు కూడా పొందినట్లు పేర్కొన్నారు. అధికారుల కు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని విమర్శించారు.ఈ నేపథ్యంలో ఆక్రమణలను వెంటనే అడ్డుకోవాలని, హైకోర్టులో అప్పీల్ వేయాలని, భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని ప్రజాప్రయోజనాలకు వినియో గించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం



**అత్తాపూర్ ఏప్రిల్ 6,ప్రభాతవార్త :** బిజెపి ఆవిర్భావ దినోత్స వాన్ని పురస్కరించుకుని సోమవారం గగన్ పహాడ్‌లో బీజేపీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షులు సురెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పంటంగి రాజ్ భూపాల్ గౌడ్ హాజరై బిజెపి నేతలతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రాజ్ భూపా ల్ గౌడ్ మాట్లాడుతూ.. బిజెపి పార్టీ ప్రారంభం నుండి నేటి వరకు సాగుతున్న విజయ ప్రస్థానం గురించి వివరించారు. దేశభక్తి, అభివృద్ధి, సుశాసనం లక్ష్యాలతో బీజేపీ ఎలా ప్రజల కు సేవలందిస్తోందో వివరించారు.అలాగే పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లే ష్ యాదవ్, జోగు రవి, వెంకట్ రమణ గుప్తా, బొమ్మ రాజు నర్సింహా, జి శ్రవణ్ , హరి కిషన్ , రాజశేఖర్ రెడ్డి అడికే మహేందర్, బల్ల శ్రీనివాస్ యాదవ్, వల్లూరి శ్రీనివాస్, గూడూరు అంజి, జేఎం శ్రీనివాస్, రామ రావు, కొండల, జే విజయ్ కుమార్, మహేష్ ,చందర్ శేఖర్, సమ రాహుల్ రెడ్డి , పి నందు,జే వినయ్ కుమార్, వి నిఖిల్, ఎం శివ , రాఘు వేం ద్రరెడ్డి, అరుణ్ కుమార్, రాజ్ కుమార్, రామ కృష్ణ, హర్ష, సాయికుమార్, చరణ్, ప్రేమ్ కుమార్ నాయకులు, పాల్గొన్నారు.

## ఆసుపత్రి నిర్మాణానికి స్థలాన్ని కేటాయించండి

**జూబ్లీహిల్స్, ఎప్రిల్ 6, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో రూ. 1.43కోట్ల వ్యయం తో నూతన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణానికి అవస రమైన స్థలాన్ని జీహెచ్ఎంసీకి కేటాయించాలని షేక్‌పేట తహ సిల్దార్ అనితారెడ్డిని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి వినతిపత్రం అందించారు. వినతి పత్రాన్ని స్వీకరించిన ఎమ్మార్వో స్పందిస్తూ భూసర్వే, పంచనా మా, స్కెచ్ రిపోర్ట్ సిద్ధం చేసి జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధి కారులకు నివేదికను అందించామన్నారు. అవసరమైన అన్ని ప్రక్రియలను త్వరితగతిన తమవైపు నుంచి పూర్తి చేస్తామని హామినిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు శంకర్, శౌరిరాజు తదితరులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసులో పాత నేరస్తుడి అరెస్ట్

**ఎల్.బి.నగర్ ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** ఇంట్లో చొరబడి దొంగత నాలకు పాల్పడుతున్న ఓ నేరస్తుల్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సంఘటన నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుం ది. నాగోల్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 4వ తేదీ అర్ధరాత్రి నాగోల్ డివిజన్ సాయినగర్ లలితనగర్‌కు చెందిన కొమ్మెర నవీన్ (20)అనే యువకుడు నాగోల్‌లోని ఎకోపాలిట్ అపార్ట్‌మెంట్ నాల్గవ బ్లాక్, ఐదవ అంతస్తులో నివసిస్తున్న రమాకాంత్ కౌశిక్ ఇంట్లోని కిటికీ గ్రిల్ తొలగించి ఇంట్లోకి చొరబడ్డాడు. కుటుంబ సభ్యులు నిద్రిస్తున్న సమయంలో మరో బెడ్‌రూమ్ లోని కబోర్డ్‌లో ఉన్న రమాకాంత్ కౌశిక్ తల్లికి చెందిన సుమా రు పదిన్నర తులాల బంగారు నగలు, ఒక నెక్లెస్, రెండు లాంగ్ చైన్లు, ఒక బ్లాక్ బీడ్స్ చైన్, గాజులు, ఉంగరాలతో పాటు హెచ్ ల్యాప్‌టాప్‌ను దింగిలించాడు. అలాగే ఒక యాక్టీ వా బైక్‌ను కూడా అపహరించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను వివిధ కోణాల్లో పరిశీలించి నిందితుడిని గుర్తించారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని ఒప్పుకు న్నాడు.దింగిలించిన నగలు, ల్యాప్‌టాప్, యాక్టీవా బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## ప్రతి సమస్యకూ పరిష్కారం ప్రజావాణిలో కలెక్టర్ ఆదేశం

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :** ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా స్వీకరించి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు ఆదేశించారు. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. స్వీకరించిన ప్రతి ఫిర్యాదు పై తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ముఖ్యంగా భూసంబంధిత సమస్యలు, పింఛన్లు, రేషన్ కార్డులు, గృహనిర్మాణ పథకాలు, ఉపాధి అంశాలపై 120 వినతులు అందాయన్నారు.కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుపై సమయపాలనతో చర్యలు తీసుకొని సమస్య లను పరిష్కరించాలని అన్నారు.

ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారులకు తెలియజేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, డీఆర్ఓ మంగీలాల్, జడ్పి సీఈఓ సుధీర్, ఆర్డీఓ వాసు చంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంతో నెరవేరుతున్న సొంతింటి కల

..మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్

**శామీర్‌పేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభంతో పేదల స్వంతింటి కల నెరవేరుతుందని,కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో లబ్దిదారుల్లో సంతోషం వ్యక్తం అవుతుందని


మజీద్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించి లబ్దిదారులతో గృహప్రవేశం చేయించిన డిసిసి అధ్యక్షులు వజ్రేశ్‌యాదవ్,తదితరుల దృశ్యం

మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని మజీద్‌పూర్‌లో ఇందిరమ్మ ఇంటి ప్రారంభం గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. దీనిలో ఆయనతో పాటు మేడ్చల్ ఎఎంసి చైర్మన్ బి.నర్సింలు యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ కంఠం శిరీషకృష్ణారెడ్డి, వైస్‌చైర్మన్ కె.మాలతిమాదవరెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్, కౌన్సిలర్లు ఎస్.వనజ అశోక్‌రెడ్డి, ఎస్.జశ్వంత్‌రెడ్డి, మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతిలతో కలిసి ఆయన ప్రారంభించి లబ్దిదారులతో గృహ పవేశం చేయించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్ మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం పలు పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పేదలు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతోనే స్వంతింటి కలను నెరవేర్చుకుంటున్నారన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుంద న్నారు. అభివృద్ధి, సంక్షేమం అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు ఊరడి వెంకటేశ, మహిళా అధ్యక్షురాలు నర్మదా, నాయకులు ఎల మల్లేశ్, భాస్కర్‌గౌడ్, వెంకటయ్య, స్వామి, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



పోమల్‌పల్లి గ్రామంలో బిజెపి జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

## ఘనంగా బిజెపి ఆవిర్భావ వేడుకలు

**-బిజెపి రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్**

**కేశంపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** కేశంపేట మండలం పరిధిలోని పోమల్‌పల్లి గ్రామంలోని 131, వ బూత్‌లో భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ వేడుకలను బిజెపి గ్రామ కమిటీ అధ్యక్షులు చాకలి మహేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు కంచుకోట మహేష్ , మండల ఉపాధ్యక్షులు కంచుకోట నరసింహ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కంచుకోట మహేష్ మాట్లాడుతూ, బీజేపీ పార్టీ గతంలో ఎదుర్కొన్న అవహేళనలను అధిగమించి నేడు ప్రపంచంలోనే అతిపెద్ద సభ్యత్వం కలిగిన పార్టీగా ఎదిగిందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న పార్టీగా బిజెపి నిలిచిందని అన్నారు. రాబోయే ఎలక్షన్లు దేశవ్యాప్తంగా బిజెపి గ్రామస్థాయి నుండి అధికారంలో ఉంటుందని హిందూత్వాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు బిజెపికి మద్దతు తెలపాలని ఆయన అన్నారు. ఈ పార్టీలో పనిచేయడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు చాకలి శేఖర్, దాసరి మహేష్, చాకలి చెన్నకేశవులు, రాములు, పెంటయ్య, మల్లయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

**తలకొండపల్లి మండల పరిధిలో..**

**తల కొండపల్లి, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:**
తలకొండపల్లి మండల పరిధిలోని మెదక్ పల్లి గ్రామంలోనాడు బిజెపి ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పార్టీ జెండా వద్ద ఎండ ఆవిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే కాలంలో బిజెపి నరేంద్ర మోడీ నాయకత్వంలో మరింత బలపడుతుందని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో పాండు, టి మల్లేష్ శీను నరేందర్ శీను విష్ణు కృష్ణ నైస్ లక్ష్మీ మ్మనారాయణ తదితరులు ఉన్నారు.



జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి నాయకులు

**దౌల్తాబాద్ మండలంలో ..**

**దౌల్తాబాద్,ఏఫ్రిల్ 6,ప్రభాతవార్త:**
భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సంధర్భంగా దౌల్తాబాద్ మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పార్టీ శ్రేణులు పాల్గొని ఆపార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని కార్యకర్తలకు దిశానిర్ధేశం చేశారు. అనంతరం బిజెపి పార్టీ నాయకులు మాట్లాడుతూ..దేశాభివృద్ధిలో భారతీయ జనతా పార్టీ పోషిస్తున్న పాత్రను కొని యాడారు. కార్యకర్తలే పార్టీకి బలమని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని వారు అశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కూంద్రు నరసింహులు, మండల మాజీ అధ్యక్షులు సతీష్‌ముదిరాజ్, పార్టీ మండల నాయకులు రాజశేఖర్, కృష్ణ, రాయకృష్ణ, వెంకటేష్, కార్తిక్, మల్లేష్, మధు, ప్రభాకర్ గౌడ్, బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.



కొత్తూరులో బిజెపి జెండా ఆవిష్కరిస్తున్న బిజెపి నేతలు

## ఇద్దరు ఎంపీల నుంచి అతిపెద్ద పార్టీగా బిజెపి

**-అంత్యోదయ లక్ష్యంతో బిజెపి ప్రయాణం**

**కొత్తూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొత్తూరు మున్సిపల్‌లో మున్సిపాలిటీ అధ్యక్షుడు రణధీర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీజెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డిజిల్లా కోశాధికారి అమడాపురం నరసింహ గౌడ్, మున్సిపల్ మాజీఅధ్యక్షుడు నాగరాజు చారి పాల్గొన్నారు. అదేవిధంగా కొత్తూరు మండలం ఎస్‌బి పల్లి గ్రామంలో బూత్ అధ్యక్షుడు వడ్డే మధు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు ఈ కార్యక్రమానికి బిజెవైఎం మండల అధ్యక్షుడు అంబటి శ్రీశైలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిజెపి దేశంలో కేవలం ఇద్దరు ఎంపీలతో ప్రారంభమై నేడు దేశంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదగడం గర్వకారణమన్నారు. అంత్యోదయ లక్ష్యంతో అవినీతి రహిత పాలన అందించడం పార్టీ గొప్ప విజయమని పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భవించి 47 సంవత్సరాలు



గుండ్లపోచంపల్లిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న బిజెపి నేతలు

పూర్తయిన సందర్భంగా కొత్తూరు మండల ప్రజలకు, ఎస్‌బీ పల్లి గ్రామ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు వారు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కొత్తూరు మున్సిపాలిటీ సీనియర్ నాయకులు పిట్టల ,శేఖర్ గౌడ్, ప్రధాన కార్యదర్శులు కోసిగి మల్లేష్ ,నాగని సురేందర్, ఉపాధ్యక్షులు ఏనుగు విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు యాదగిరి ,కుమార్ నాయక్ ,పాండు నాయక్ ,ప్రశాంత్ ,శివ, రాము, మల్లేష్, అనిల్, నవీన్ మరియు తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ ఉమ్మడి మండలంలో**

**మేడ్చల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** మేడ్చల్ ఉమ్మడి మండలంలోని మేడ్చల్, కిష్టాపూర్ పూడూర్, గుండ్లపోచంపల్లి డివిజన్‌లు, ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బూత్‌లల్లో పార్టీ జెండావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర నాయకుడు విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బిజెపి ఎదిగిన తీరు అద్భుతమని అన్నారు.1980 ఏప్రిల్ 6న ఆవిర్భవించిన భారతీయ జనతా పార్టీ, నేడు ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని తెలిపారు. సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని, పార్టీ సిద్ధాంతకర్తలు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ, పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయల ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమరం మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, ఎల్లంపేట మున్సిపల్ అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు కృష్ణ గౌడ్, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జును ముదిరాజ్, అమరం సరస్వతి, నాయకులు శ్రీధర్, శ్రీనివాస్, విష్ణువర్ధన్ రెడ్డి, వంశీ, శ్రీనివాస్, పుష్పరెడ్డి, నాగేందర్‌రెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూచిపూడి నృత్యంలో ప్రతిభ చాటిన మోక్షధృతి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన మోక్షధృతి కూచిపూడి నృత్యంలో అద్భుతమైన ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. హైదరాబాద్‌లోని బిఎం బిర్లా ప్లానిటోరియంలో తెలంగాణ బాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో నిర్వహించిన 'శ్రీసీతారామ కళ్యాణ వైభోగం' సంగీత నృత్య నిరాజనం కార్యక్రమం కళా ప్రియులను ఆకట్టుకున్నది. సాంప్రదాయ సంగీతం, నృత్యాలతో సాంస్కృతి వాతావరణం నెలకొన్న కార్యక్రమంలో ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి మోక్షధృతి తన ప్రదర్శనతో ఆకట్టుకుంది. రామాయణంలోని సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని ఆధారంగా చేసుకొని ఆమె ఆందించిన నృత్య రూపకం భావప్రధానంగా, సాంప్రదాయ సౌందర్యంతో నిండినదిగా నిలిచింది. ప్రత్యేకంగా ఆమె అభినయం, లయబద్ధత, అంగీకాభినయాలు ప్రేక్షకుల ప్రశంసలను అందుకున్నాయి. ఈసందర్భంగా మోక్షధృతిని నిర్వహకులు 'కోదండరామ అవార్డు'తో జ్ఞాపికను అందజేసి సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత స్థాయిలను చేరాలని



అవార్డు అందుకుంటున్న మోక్షధృతి

వారు ఆశీర్వదించారు. కళాసాహిత్య రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యువ కళాకారులకు మంచి వేదిక కల్పించబడుతోందని నిర్వహకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి రసమయి అధ్యక్షులు ఎంకె.రాము, తెలంగాణ జాగృతి ఫౌండేషన్ అధ్యక్షులు పద్మ వెంకటేష్, స్వాగితికా కళానిలయం అధ్యక్షులు అనిత ప్రియదర్శిని, కవి–గాయకులు దరువు అంజన్న, ఓయూ ప్రొఫెసర్ జయశ్రీ తదితరులు ముఖ్యఅతిథులు హాజరయ్యారని తెలిపారు.

## ఇవిఎం గోదాంను పరిశీలించిన కలెక్టర్

**వికారాబాద్, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గల ఈవీఎం గోడౌన్ ను కలెక్టర్ దీపక్ తివారి, అధికారులతో కలిసి సోమవారం సందర్శించి పరిశీలించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామాగ్రిని భద్రపరిచిన గదులను కుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేశారు. ఈవీఎంల భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత రిజిస్టర్ లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ కార్యక్రమములో ఆర్డీఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మీ మ్మ నారాయణ, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు నెమత్ హాలీ, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఈవీఎం గోదాంను పరిశీలించి రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్

## సమస్యల పరిష్కారం కోసం ప్రజల తరపున పోరాడాలి



బిజెపి కౌన్సిలర్లను సన్మానిస్తున్న బిజెపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు

**బిజెపి కౌన్సిలర్లను సన్మానించిన వడ్ల నందు**

**వికారాబాద్, ప్రభాతవార్త :** నూతనంగా ఎన్నికైన బిజెపి కౌన్సిలర్లను బిజెపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ వడ్ల నందు ఘనంగా సన్మానించారు. గత రెండు రోజుల క్రితం నలుగురు బిజెపి కౌన్సిలర్లు వికారాబాద్ మున్సిపల్ కౌన్సిల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం వడ్ల నందు నివాసానికి వారిని ఆహ్వానించి సన్మానించారు. 33 వ వార్డు కౌన్సిలర్, బిజెపి కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ అనిల్ యాదవ్, 5 వ వార్డ్ కౌన్సిలర్ స్రవంతి శ్యామ్ రెడ్డి, 24 వ వార్డ్ కౌన్సిలర్ రుచిత సాయి చరణ్ రెడ్డి, 28 వ వార్డు కౌన్సిలర్ లావణ్య సురేందర్ లను సన్మానించారు. ఈ సందర్భంగా వడ్ల నందు మాట్లాడుతూ, పట్టణ ప్రజల సమస్యలను, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డులో ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే స్పందించి సంబంధింత అధికారులతో మాట్లాడి ప్రజల తరపున పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెవైఎం జిల్లా అధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి,నాయకులు మల్లా రెడ్డి, నర్సిములు, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్జరీ సంతకాలతో పట్టా మార్చారు

**తహసీల్దార్ కార్యాలయం ముందు బాధితుల ఆందోళన**

**పెద్దేముల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** తమ భూమిని ఫోర్జరీ సంతకాలతో పట్టా మార్పిడి చేసుకున్నారని ఆరోపిస్తూ భూ బాధితులు సోమవారం పెద్దేముల్ తహసీల్దార్ కార్యా లయం ముందు ఆందోళన చేపట్టారు.
దొంగ సంతకాలతో పహనీలో పేరు నమోదు చేసుకున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బంటారం మండలం బోపునారం గ్రామానికి చెందిన నత్తల ఆశప్ప, నత్తల బాలప్పలు తమ భూమికి సంబంధించి వివరాల ప్రకారం.. తట్టెపల్లి శివారులోని సర్వే నంబర్ 30లో తమ పెద్దల ఆస్తి అయిన అంతమ్మ పేరిట ఉన్న 11.14 ఎకరాల భూమిలో, 7.05 ఎకరాలను సోలార్ ప్లాంట్ వారికి విక్రయిం చారు. మిగిలిన 4.09 ఎకరాల భూమిని తమ పేరిట మార్చుకునేందుకు 2017లో కార్యాల యానికి వెళ్లగా, అది నత్తల విమలమ్మ పేరుపై ఉన్నట్లు గుర్తించారు. అంతమ్మ 2013లో మరణించగా, ఆమె కోడలైన విమలమ్మ తానే అంతమ్మనంటూ తప్పుడు పత్రాలు సృష్టించి భూమిని తన పేరిట మార్చుకుందని బాధి తులు ఆరోపించారు. పాత పాసుపుస్తకంలో పేరు చెరిపివేసి



మాట్లాడుతున్న భూబాధితులు

విమలమ్మ పేరును రాసుకున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డిజిటల్ సంతకాన్ని నిలిపివేయాలని కోరారు. విమలమ్మకు సంబంధించిన డాక్యుమెంట్లను రద్దు చేయాలని, అప్లికేషన్‌ను డిలీట్ చేయా లని, గత ఏడాది ఆగస్టు 22న ఆర్డీఓ , తహసీ ల్దార్‌ను కలెక్టర్ ఆదేశించినట్లు బాధితులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ భూమిని తమకు అప్పగించి న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

## బిజెపి దేశఖ్యాతిని ప్రపంచానికి చాటింది



ఆమనగల్లులో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న తల్లోజు ఆచారి

**ఆమనగల్లు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఆమనగల్లు మండల కేంద్రంలో శనివారం బిజెపి ఆవిర్భావ దినోత్స వం నిర్వహించారు. పార్టీ బూత్ కమిటి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రధాన చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరిం చారు. జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ .. బిజెపి పాలనలో దేశఖ్యాతి ప్రపంచానికి చాటిందని కొనియాడారు.
అనంతరం మిఠాయిలు పంచి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కండె హరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి గోరటి నర్సింహ్మా, కౌన్సిలర్లు మొక్తాల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్లు చెక్కాల లక్ష్మణ్, శ్రీకాంత్‌సింగ్, మండల పార్టీ అధ్యక్షుడు కెకె శ్రీను, పట్టణ అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, పార్లమెంటు బిజెవైఎం కో కన్వీనర్ రవిరాథోడ్, బైకని శ్రీశైలం యాదవ్, పంచమల్లయ్య, జెనిగల గిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోండి

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** పోచారం డివిజన్ వెంకటా పూర్ అనురాగ్ యూనివర్శిటీలో ఆదివారం రాత్రి సినర్జీ 2కె26 వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నాణ్యమైన విద్య, సమగ్ర అభివృద్ధికి యూనివర్శిటీ కట్టుబడి ఉందని అన్నారు. విద్యా ర్థులు క్రమశిక్షణతో కూడిన విద్యతో సామాజిక అంశాలపట్ల అవగాహన కలిగియుండాలని అన్నారు. తాము ఎంచుకున్న లక్ష్యసాధన కొరకు విద్యనభ్య సించాలని అన్నారు. యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ అర్చనా మంత్రి మాట్లా డుతూ భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దడంలో విద్యా ప్రావీణ్యం, ఆవిష్క రణల ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రతిభావంతమైన విద్యా ర్థులకు పురస్కారాలను ప్రదానం చేశారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనే జ్‌మెంటు, మెడిసిన్, అగ్రికల్చర్, నర్సింగ్ తదితర విభాగాల నుండి అగ్రస్థానం సాధించిన విద్యార్థులను సత్కరించారు. అదనంగా ప్రతిష్టాత్మక మైన ఎన్‌పిటిఈఎల్ గోల్డ్ సర్టిఫికేట్లు పొందిన విద్యార్థులను గుర్తించి, అధ్యా పకులకు ఎన్‌పిటిఈఎల్ ఫ్యాకల్టీ స్టార్ అవార్డులు ప్రధానం చేశారు. క్రీడలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, అద్యాపకులను సత్కరించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి, నృత్యప్రదర్శన ఇస్తున్న అనురాగ్ యూనివర్శిటీ విద్యార్థినిలు

ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయనీ మనీషా తన ఆటపాటలతో ఉర్రూ తలుంగించారు. యూనివర్శిటీ సీఈతో నీలిమ, అసోసియేట్ ఉపాధ్య క్షుడు అనురాగ్ పల్లా, డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ విజయ కుమార్, డీన్ ఎగ్జా మ్స్ ముత్తారెడ్డి, డిన్ స్టూడెంట్స్ అఫైర్స్ వి. శ్రీనివాసరావు, డీన్ సీఎస్‌సీ విష్ణుమూర్తి, డీన్ అగ్రికల్చర్ నారాయణ రెడ్డి, డీన్ మెడికల్ కాలేజ్ లక్ష్మీ ప్రసన్న,డీన్ ఫార్మసీ వసుధ బాక్షీ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మల్లేశ్, అధ్యా పకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కామ్రేడ్ బీటీ రణదీవే కు నివాళ్ళు అర్పిస్తున్న సిఐటియు నాయకులు

## కామ్రేడ్ బిటి రణదీవేకు ఘన నివాళి

**దుద్యాల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కమ్యూనిస్టు కార్మిక ఉద్యమ నాయకులు కామ్రేడ్ బిటి రణదివే 32వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో సిఐటియు నాయకులు ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. సిఐటియు జిల్లా ఉపా ధ్యక్షుడు బుస్స చంద్రయ్య మాట్లాడుతూ.. తను, తన కుటుంబ ప్రయోజనాల కంటే కార్మిక ప్రయోజనాల కోసం నిస్వార్థంగా పనిచేసిన గొప్పనేత రణదివే అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు దస్తగీర్, హనుమంతు, బుడ్డప్ప, అర్జునయ్య, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### జిపి నిధులు దుర్వినియోగం చేశారంటూ ప్రజావాణిలో ఫిర్యాదు

**దుద్యాల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని ఉపసర్పంచ్ ఏదుల అనురాధ, వార్డ్ మెంబర్ విశాల్‌లు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నోట్ ఫైల్ పైన ఉపసర్పంచ్ సంతకం లేకుండానే సర్పంచ్, సెక్రటరీ, ఎంపిడిఓలు నిధులు డ్రా చేశారని ఆరోపించారు. గ్రామపంచాయతీ నిధుల వినియోగం పై పారదర్శకత లేదని, వివరాలు తెలియనియడం లేదని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఈతకు వెళ్లిన బాలుడు అనంత లోకానికి

**చౌడపూర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** పరిగి నియోజకవర్గం చౌడపూర్ మండలంలో విషాదం చోటు చేసుకుంది. కన్మాన్ కల్వ గ్రామానికి చెందిన షంషేర్ అనే బాలుడు 9 సంవత్సరాలు తీవ్ర ఎండాకాలం కావడంతో బావిలో గీతకు వెళ్లి ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. అక్కడ ఉన్న గ్రామస్తులు చూసి ఆ బాలుడిని బయటకు తీసి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించడం జరిగింది. ఆ బాలుడిని చూసి తల్లిదండ్రులు జీర్ణించుకోలేక పోతున్నారు కన్నీరు మున్నీరు పెట్టుకున్నారు.

## గంజాయి వ్యతిరేక అవగాహన సదస్సు సిఐ సైదులు హెచ్చరిక




**జవహర్ నగర్, ఏప్రిల్ 6. ప్రభాతవార్త:** జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అంబేద్కర్ నగర్ సాయిబాబా నగర్ కాలనీ దొండ తోటలో సీఐ సైదులు ఆధ్వర్యంలో గంజాయి వినియోగం దొంగతనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బల్లి శ్రీనివాస్. మాజీ కార్పొరేటర్ సాయి. స్థానికులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ సైదులు మాట్లాడుతూ, కాలనీలలో అనుమానాస్పద వ్యక్తులు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. గంజాయి వినియోగాన్ని అరికట్టడంలో ప్రజల సహకారం కీలకమని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలకు మంచి చెడు అలవాట్లపై సరైన మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత తమదేనని పేర్కొన్నారు. కాలనీలో భద్రతను మెరుగుపరచేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, పోలీస్ పహారా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
గంజాయి వినియోగం మరియు దొంగతనాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సైదులు స్పష్టం చేశారు.

## ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కార్యకర్తలే పార్టీకి బలమని దేశసేవలో బిజెపి చేస్తున్న కృషిని ప్రజలలోకి తీసుకువెళ్లాలని బిజెపి ఘట్‌కేసర్ డివిజన్ అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి అన్నారు. మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ఘట్‌కేసర్ డివిజన్ పరిధిలో సోమవారంభారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భం గా డివిజన్‌లోని మూడు ప్రధాన కేంద్రాల్లో బూత్ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బిజెపి పతాకాన్ని డివిజన్ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి ఆవి ష్కరించారు. భారతమాత చిత్రపటానికి పూలమాల వేసి పూజ చేసి భారత్‌మాతాకి జై, వందేమాతరం నినాదాలు చేశారు. ఈకార్యక్రమంలో డివిజన్ ఉపాధ్యక్షులు పడిగెం వీరేశం, ప్రధానకార్యదర్శి చెల్లక శ్రీధర్, కిసాన్‌మోర్చ నాయకులు కట్ట మధుసూధన్‌రెడ్డి, యువమోర్చ అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, సురుపు అనిల్‌గౌడ్, సీనియర్ నాయకులు పల్లె మధుసూధన్‌గౌడ్, బండ్లగూడెం కిషోర్‌కుమార్‌గౌడ్, దేశం అభిమన్యుగౌడ్, పల్లె శివ, బూత్ అధ్యక్షురాలు ఆకుల పద్మ, మెరుగు నర్సింహ్మారెడ్డి, శోభన్‌బాబు, మణిదీప్ ముదిరాజ్, పిట్ల సిద్ధు, జగదీష్‌రెడ్డి, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో బిజెపి పతాకాన్ని ఎగురవేసిన అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి


**IN THE COURT OF THE HON'BLE III ADDL JUNIOR CIVIL JUDGE CUM X ADDL. JUDICIAL MAGASTATE OF FIRST CLASS MEDCHAL-MALKAJ-GIRIDISTRICT, AT: MEDCHAL**
**O.S. No. 104 of 2026**
**Between:**
Sri. Kattula Venkatesham and 3 others.
**...Plaintiffs**
**AND**
1. The Tahsildar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist.
2. All Concerned
**...Defendants**
Take notice that the plaintiffs herein filed the above suit for declaration to declare the plaintiffs are theonly legal heir of the deceased Late Kattula Kamala W/o. Kattula Venkatesham who died on22-07-2022, and the suit is stands posted on22-04-2026. If any person or persons having any objections or claims they may appear before the Hon'ble III Addl Junior Civil Judge cum Xth Addl Judicial Magastate of First Class Medchal-Malkajgiri District at Medchalon 22-04-2026 at 10-30 a.m. either in person or through an advocate, failing which the matter will be decided basing on the documents available on record.
**(By order of the Court)**
**M/s.B. VINAY KUMAR MUDHIRAJ**
**B. PAVAN KUMAR**
Advocates
R/o.H. No. 7-93/27, 1st Floor, Lakshmi Nilayam, Balaji Nagar, Aliabad X Road, Shamirpet (M), Medchal-Malkajgiri, Dist-101.
**Cell: 9100624150**
(Counsel for Plaintiff's)



**PUBLIC NOTICE**
Notice is hereby given to the general public that I, Thalari Manjula, w/o. Late Thalari Naveen, aged about 38 years, Occ: Housewife, R/o. H.No. 1-86, Kandlakoya village, Medchal Mandal, Medchal- Malkajgiri dist. I am the absolute owner and possessor of an open Place admeasuring 121 sq. yards (partly sold out) in survey number 6, situated at Thurkapalli village, Shamirpet Mandal, through the registered sale deed, the document bearing No.3909 of 2014, dt:16-12-2014, registered at SRO, Shamirpet. The aforesaid document was lost on 25-03-2026, while I was traveling by TGRTC bus from Thurkapalli Village to Kandlakoya Village via Shamirpet. Any person who finds the said document is requested to return it to the above-mentioned address or contact me at 9849526002. The public is hereby cautioned not to enter into any transactions, dealings, or agreements with any person in respect of the property covered by the said document, as I remain the absolute owner of the same.
**Sd/- S.Yadagiri**
Advocate
R/o.H.No. 2-62/HM/42, Padmashree Enclave, Kandlakoya (V), Medchal Mandal, Medchal-Malkajgiri Dist.



ఫుడ్ సేఫ్టీపై కేశంపేటలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

## హెల్త్ వీక్ ఘనంగా ప్రారంభం

**కేశంపేటలో ఫుడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమం**

**కేశంపేట, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపిడిఓ రవిచంద్ర కుమార్ రెడ్డి అన్నారు.జ ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణలో హెల్త్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హెల్త్ వీక్‌లో మొదటి రోజు ఫుడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమాన్ని కేశంపేటలో సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేశంపేట ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో గ్రామపంచాయతీ లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు ఆహార భద్రతపై అవగాహన కల్పించారు. మానవహారం ఏర్పాటుచేసి నినాదాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారు. అనంతరం పిహెచ్‌సిలో ఫుడ్ ప్రొడక్షన్ ఫుడ్ బ్రౌన్ డిజిసెస్ అంశంపై అవగాహన సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రవి చంద్ర కుమార్ రెడ్డి , డా. నిఖిత మండల మెడికల్ అధికారి, సంతోష్ శ్రీశైలం సర్పంచ్, వార్డు సభ్యులు, మరియు దివ్య సింగ్ ఐసిడిస్ సూపర్వైజర్, సమంత ఐసిడి సూపర్వైజర్. సదానందం ఎంపీహెయో, శ్రీనివాస్ ఎంపీహెయో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది మరియు గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు వెంటనే స్పందన

**- ఎమ్మెల్యే సహాయంతో సంతోషకు ఆర్థిక భరోసా**



బాధిత కుటుంబానికి ఎల్‌ఓసి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి

**కొత్తూరు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కొత్తూరు మున్సిపాలిటీకి చెందిన సంతోష అనే మహిళ కిడ్నీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఆర్థిక పరిస్థితులు బలహీనంగా ఉండటంతో చికిత్సకోసం ఇబ్బంది పడుతున్న కుటుంబం, స్థానిక కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీరమోని దేవేందర్ ముదిరాజ్‌ను సంప్రదించారు.ఈ విషయాన్ని వెంటనే స్పందించిన దేవేందర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో, ప్రభుత్వ పథకం కింద ఎల్‌ఓసి ద్వారా సంతోష కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం సోమవారం మంజూరు చేయించారు. ఈ సందర్భంగా సంతోష కుటుంబ సభ్యులు తమకు అండగా నిలిచిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మరియు దేవేందర్ ముదిరాజ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి తక్షణ సహాయం అందేలా చూడటం మన బాధ్యత. అవసరమైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా ప్రయత్నిస్తాం అని ఆయన తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థిని మృతి

**కొడంగల్,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** పాఠశాలకు వెళ్తున్న ఓ విద్యార్థినిని లారీ రూపంలో మృత్యువు కబళించడంతో కానరాని లోకాలకు వెళ్ళి పోయింది.సోమవారం ఉదయం కొడంగల్‌లో చోటుచేసుకుంది.ఎస్సై జీవీ.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం..ఒడంగల్ పట్టణంలోని కార్గిల్ కాలనీకి చెందిన రెహానా బేగం(50)చాంద్‌పాషా దంపతులు.వీరికి సంతానం లేకపోవడంతో అయేషా(5) అనే అమ్మాయిని దత్తత తీసుకున్నారు.చిన్నారి అయేషా కొడంగల్ పట్టణంలోని అల్సా పాఠశాలలో ఎల్‌కెజి చదువుతుంది.రోజు మాదిరిగా రేహానీ బేగంతో కలిసి చిన్నారి అయేషా పాఠశాలకు వెళ్తున్న క్రమంలో కొడంగల్ ఆర్టీసీ బస్టాండన ముందు రావులపల్లి నుంచి పరిగి వైపు వెళ్తున్న కేఏ32ఏఏ1607 నెంబరు గల లారీ డ్రైవర్ సిద్దప్ప అజాగ్రత్తగా నడుపుతూ చిన్నారిని ఢీకొట్లాడుర.ఈ సంఘటనలో చిన్నారి అయేషా అక్కడికక్కడే మృతిచెందింది.ఈ సంఘటనపై రెహానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



నూతన కమిటీ సభ్యులు

## డిబిఎస్‌యూ అధ్వర్యంలో సివిఎంసి నూతన కార్యవర్గం ఎన్నిక

**కొడంగల్,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** డిబిఎస్‌యూ ఆధ్వర్యంలో సివిఎంసి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో దళిత బహుజన శ్రామిక యూనియన్ ఆధ్వర్యంలో సిటిజన్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ(సివిఎంసి)నూతన కమిటిని ఎన్నుకున్నారు.సివిఎంసి కన్వీనర్‌గా చింతల్‌దిండి శేఖర్(కొడంగల్),కో కన్వీనర్‌గా కావలి ఆశమ్మ(హుస్సేన్‌పూర్)లను ఎన్నుకున్నారు.కార్యవర్గ సభ్యులుగా ప్యాలమద్ది మొగులప్ప,చసాయప్ప,అంజిలప్ప,భారతమ్మ,హన్మంతులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా డిబిఎస్‌యూ జిల్లా కార్యదర్శి లింగం సాయిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సి,ఎస్టి చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో డిబిఎస్‌యూ ముఖ్య నాయకులు నర్సింహ,బాలరాజ్,జిల్లా కళాకార సంఘం అధ్యక్షులు కొత్తూరు బాలు,తెలంగాణా లెక్చరర్ ఫోరం ఉమ్మడి రంగారెడ్డి,మహబుబ్‌నగర్ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.సాయిలు

## ఎమ్మార్పీఎస్ నాయకులకు అవార్డులు

**మేడ్చల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఈ నెల 5న రవీంద్రభారతిలో నిర్వహించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాల్లో పలువురు అవార్డు అందుకున్నారు.కమిటీ చైర్మన్ సుదర్శన్ బాబు, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారుల చేతుల మీదుగా ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎన్ వై అశోక్, ఎంఆర్పిఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇన్చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ సమక్షంలో ఎమ్మార్పీఎస్ నాయకులు డబిల్‌పురం పరశురాం, జీడిపల్లి శివకుమార్, జీడిపల్లి రామకృష్ణ, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎర్ర బాలకృష్ణ, గడ్డం రాజ్ కుమార్‌లు అవార్డులు అందుకున్నారు.

**పరశురాంకు దళితరత్న అవార్డు...**

బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ పరిధిలో కిష్టాపూర్ గ్రామానికి చెందిన డబిల్‌పురం పరశురాంకు దళితరత్న అవార్డును అందుకున్నారు. గత 18 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్‌లో ఉండి జాతి ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తూ, ఎస్సీ వర్గీకరణ పోరాటంలో ఆయన చూపిన చొరవకు ఈ అవార్డు లభించింది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ బాబు, ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షులు ఎన్.వై. అశోక్, ఎంఆర్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ జిల్లా ఇన్చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ సమక్షంలో ఈ అవార్డును అందుకున్నారు.డబిల్‌పురం పరశురాం మాటాల్డుతూ తమకు ఈ గౌరవం దక్కడం




దళితరత్న అవార్డు అందుకున్న పరుశురాం

# కల్వకుర్తిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

**పడకల్లో మహిళా సమాఖ్య భవనానికి భూమి పూజ**

**కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**తలకొండపల్లి, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తిచేసి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం నాడు తలకొండపల్లి మండల పరిధిలోని పడకల్ గ్రామంలో గ్రామ సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్మించే మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. అంతకుముందు పడకల్ గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు . అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పెద్దలు అధికారుల సహకారంతో గ్రామాల్లోని అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన అన్నారు. గ్రామములో10 లక్షలతో నిర్మించే మహిళా సమాఖ్య భవనం, వివిధ అభివృద్ధి పనులకు 1.25 కోట్ల రూపాయల నిధులు మంజూరి చేశారు.గ్రామాల్లోని సిసి రోడ్లు, అవసరమగు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పడకల్ సర్పంచ్ దోకూరు సునీత ప్రభాకర్ రెడ్డి, అమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాద గీతా నరసింహ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి జోగు రమేష్, నరసింహ, ఏపీఎం రామస్వామి, తో పాటు స్థానిక మహిళా సంఘం సభ్యురాలు గ్రామస్తులు పాల్గొన్నారు.

### రాబోయే రోజుల్లో రెండో మూడో విడతల్లో ఇందిరమ్మ ఇల్లు

**తలకొండపల్లి, ఏప్రిల్ 6 ,ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో పూర్తయిన ఇందిరమ్మ ఇల్లును సోమవారంనాడు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతులమీదుగా ప్రారంభించారు. గ్రామానికి చెందిన మంద సుమిత్ర రాములు దంపతుల ఇందిరమ్మ ఇల్లుపూర్తి కావడంతో ఆయన రిబ్బన్ కట్ చేసి ఇంట్లో పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల గుర్తించి అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రెండో మూడో విడతల్లో సైతం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. అనంతరం వెల్జాల్ గ్రామంలోని లక్ష్మి నరసింహ స్వామి దేవాలయంలో వివిధ అభివృద్ధి పనుల కోసం గతంలో ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర పర్యాటక శాఖ నుంచి 3 కోట్ల రూపాయలు మంజూరికి సంబంధించిన ప్రోసిడింగ్సు ఆలయ పూజారి శ్రీనివాసమూర్తికి అందించారు. టూరిజం శాఖతో దేవాలయంలో కమ్యూనిటీ హాలు, కాటేజ్ తదితర పనులు పూర్తి చేయనున్నట్లు ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. సిఎం రిలీఫ్ ఫండ్ కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోకూరు ప్రభాకర్ రెడ్డి, అమంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీతా నరసింహ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటరెడ్డి, మాజీ ఎంపిటిసి శ్రీనివాసమూర్తి, మాజీ ప్రజా ప్రతినిధులు రఘు రాములు, జోగు రమేష్, రమేష్ యాదవ్, డేవిడ్ , రేన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అజిత్ నరసింహారెడ్డి, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి జన్మదిన వేడుకలు

**-ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు, పండ్లు పంపిణీ**



కేక్ కట్ చేస్తున్న బిఆర్ఎస్ నేతలు



జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలో కేక్ కట్‌చేస్తున్న బిఆర్ఎస్ నాయకులు

**కేశంపేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :**కేశంపేట మండల కేంద్రంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నవీన్ రెడ్డి జన్మదిన సందర్భంగా భారీ సంఖ్యలో కార్యకర్తలు ఆయన పుట్టినరోజులు వేడుకలను కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు,పండ్లు పంపిణీ చేసి చేశారు కేశంపేట మండల కేంద్రంలో మండల పరిధిలోని బిఆర్ఎస్ సర్పంచులు,మాజీ సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు,బిఆర్ఎస్ నాయకులు కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఈ పాపిరెడ్డి గూడ మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి కేశంపేట మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి వందల సర్పంచ్ వెంకట్ మాట్లా డుతూ నవీన్ అను నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడుగా పేరు సంపాదించుకున్నాడని అనునిత్యం ప్రజాసమస్యలపై పోరాడే నాయకుడని, నవీన్ అన్నా అని బిఆర్ఎస్ అభివృద్ధికి మరియు నాయకుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తాడని వారు అన్నారు.ఈ వేడుకలలో లింగంధన సర్పంచ్ నాగిళ్ల వెంకట్,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి, తూర్పుగడ్డ సర్పంచ్ తౌర్య నాయక్, భైరాఖాన్ పల్లి సర్పంచ్ తనయుడు శివ యాదవ్, మాజీ సర్పంచ్ లు తలసాని వెంకట్ రెడ్డి, యారం శేఖర్ రెడ్డి,తాండ్ర విష్ణువర్ధన్ రెడ్డి, ఆంజనేయులు యాదవ్,ప్రభాకర్ రెడ్డి,రాములు, కృష్ణయ్య, పాపిరెడ్డి గూడ డిప్యూటీ సర్పంచ్ తాండ్ర జ్యోతి నరేందర్ రెడ్డి,లెమామిడి డిప్యూటీ సర్పంచ్ ప్రమోద్ రెడ్డి,కొత్తపేట డిప్యూటీ సర్పంచ్ దర్శన్,ఇప్పల పల్లి సురమోని పద్మ సహదేవ్,మాజీ ఉపసర్పంచ్ దశరథం మాజీ ఎంపిటిసిలు యాదయ్య, రాంచందర్ నాయక్, బిఆర్ఎస్ నాయకులు జగన్ రెడ్డి,రామ్ రెడ్డి, పల్లాటి కృష్ణయ్య,నాగరాజు నరేందర్.జి, అబ్బి శ్రీను, మ్యాదరి ప్రవీణ్,చిన్న నాయక్,సురమోని శంకర్,చాకలి హన్మయ్య,పల్లాటి శీనయ్య,తాండ్ర క్రిష్ణ రెడ్డి,గూడా శేఖరయ్య, అల్వాల రాజు, నాగుల్ కృష్ణ, అబ్బి రవి,మ్యాదారి కుమార్, గొల్ల ఆంజనేయులు యాదవ్, లెంకపోతుల మనిగౌడ్, అబ్బి వీరేష్, శ్రీకాంత్,జర్పుల సురేష్,బేరి నవీన్, బేరి యాదయ్య, గడ్డమీది శ్రీనివాస్, అబ్బి యాదయ్య,కొత్తపేట లక్స య్య,కృష్ణకేశంపేట మురళి,తలసాని ప్రవీణ్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**జిల్లెడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో ..**

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 06,(ప్రభాతవార్త):** జిల్లెడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో సోమవారం ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల్ కేంద్రంలో కేట్ కట్ చేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్, జంగయ్య, విజయలక్ష్మి ,దామోదర్ రెడ్డి,శేఖర్,రాంచరణ్, మీదిగడ్డ బాబురావు. కోనేరు నర్సింగ్ రావు, హరి నాయక్,రాజు నాయక్ పిట్టె రమేష్, బాలరాజ్, ధీమా గణేష్ , కిషన్, రమేష్ నాయక్,వెంకన్న,బాసు రామస్వామి,శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ నర్సింలు,నవీన్ పటేల్, వడ్ల శ్రీనివాస్, శ్రీను నాయక్,వినోద్, శివ, సంతోష్, అభి తదితరులు పాల్గొన్నారు.

### రక్తదానం చేసిన నవీన్ రెడ్డి అభిమానులు

**కొందుర్గు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఎమ్మెల్సీ నారకుంట నవీన్ కుమార్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు రక్తదానం చేశారు. సోమవారం స్థానిక జి ఎం పటేల్ వార్డెన్‌లో మండల పరిధిలోని మహాదేవపూర్ గ్రామ సర్పంచ్ బోడంపాటి అనూష రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీకి పలువురు నాయకులు పార్టీ కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో రవీందర్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ నారకుండా నవీన్ రెడ్డి అభిమానులు, పలువురు కార్యకర్తలు రక్తదాన శిబిరం చేశారు. ఈ జన్మ దిన వేడుకల్లో మాజీ మండల వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, పార్టీ సీనియర్ నాయకులు ఏదిరా రామకృష్ణ, కార్యకర్తలు బోయ ప్రశాంత్, చెన్నయ్య, పెర్మల్ రెడ్డి, కబీర్ దాస్, లతీఫ్, నాగేష్, శేఖర్, నాగేష్ పాల్గొన్నారు.

## వేసవిలో త్రాగునీటి కోసం చలివేంద్రం

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** వేసవికాలంలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం చేస్తాయని లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ సార శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ డివిజన్ కొండాపూర్ రోడ్డులోని గురుకుల్ జూనియర్ కళాశాల ముందు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవికాలం దృష్ట్యా ఘట్‌కేసర్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఇక్కడ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. లయన్ బోగా శ్రీలక్ష్మిహరినాథ్, ఉడుత హిమబిందు నవీన్‌ల సౌజన్యంతో బాటసారుల కోసం త్రాగునీటిని అందిస్తునానరు. ప్రజలకు గ్లాసులతో నీటిని అందించి చలివేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఈకార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు లయన్ సార శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి లయన్ బచ్చు ప్రమోద్‌గుప్తా, ఉపాధ్యక్షులు లయన్ రేసు లక్ష్మారెడ్డి, మెంబర్‌షిప్ అధ్యక్షులు బచ్చు నగేశ్‌గుప్తా, చందుపట్ల లక్ష్మారెడ్డి, ఎస్.రాజు, నాలూరి నర్సింగ్‌రావు, ఎస్.మురళీగౌడ్, హరినాథ్ బోగ, వెంకటేశ్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.




గురుకుల్ కళాశాల వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

## సెకండ్ ఏఎన్ఎంల జీతాల కోతలు విధించటం అన్యాయం

**..కట్‌చేసిన వేతనాలు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలి**

**..ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** సెకండ్ ఏఎన్ఎంల జీతాలలో కోతలు విధించటం అన్యాయమని, వెంటనే కట్‌చేసిన వారి వేతనాలను వారి ఖాతాల్లో జమ చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద సెకండ్ ఏఎన్ఎంలు సమస్యలపై ధర్నా చేసి ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌కు, డిఎంఅండ్‌హెచ్‌ఓకు వారు వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ సెకండ్ ఏఎన్ఎంలకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పనిచేసిన జీతాల్లో కోత విధించటం ఎంత వరకు సబబు అని అన్నారు.మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంల జీతాలలో కోతలు విధించారని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులకు వచ్చె జీతాలు చాలా తక్కువ అని, ఉద్యోగ రీత్యా రవాణా ఖర్చులకే సగం జీతం సరిపోతుందని, ఈ సమయంలో వారి జీతాల్లో కోతలు పెట్టటం దారుణమన్నారు. ఆధార్ బేస్డ్ అడ్వాన్స్‌ను పంపించాలని డైరెక్టర్ హెల్త్ నుంచి జిల్లా అధికారులకు 6న లేఖ వచ్చిందని,ఆ జీవోలో కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు రెగ్యులర్ ఉద్యోగులకు కూడ ఆదార్ బేస్డ్ అటెండెన్స్‌ను తీసుకోవాలని ఉందన్నారు. రెగ్యులర్ వారికి జీతాలు కట్ లేకుండ కాంట్రాక్టు ఉద్యోగులకు మాత్రమే కోత విధించటం వారి పట్ల వివక్షత చూపినట్లు ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర కార్యవర్గసభ్యులు తోట రామాంజనేయులు, తెలంగాణ రాష్ట్ర సెకండ్ ఏఎన్ఎం యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కోశాధికారి ఎస్.రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు మెటల్డా, కె.అనిత, మంగ, అన్నపూర్ణ, డిఈఓల యూనియన్ నాయకులు నరసింహ్మా, స్వప్న, సంపూర్ణ, కళావతి, పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన వ్యక్తం చేసిన సెకండ్ ఏఎన్ఎంలు, మద్దతు పలికిన ఏఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ,నాయకులు తదితరుల దృశ్యం



డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరికి వినతిపత్రంను అందజేసిన సెకండ్ ఏఎన్ఎంలు,పాల్గొన్న నాయకుల దృశ్యం



హెచ్‌పీవీ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

## కిశోర్ బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్‌పివి టీకా తప్పనిసరి

**-క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం కృషి**

**-దౌల్తాబాద్ వైద్యాధికారిణి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని**

**దౌల్తాబాద్,ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** కిశోర బాలికల భవిష్యత్తులో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ బారిన పడకుండా ఉండాలంటే హెచ్‌సివి (హ్యూమన్ పాపిలోమా వైరస్)టీకా తప్పనిసరిగా వేయించుకోవాలని దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అమూల్య ప్రియదర్శిని సూచించారు.సోమవారం రోజు ప్రభుత్వం చేపట్టిన క్యాన్సర్ నివారణ కార్యక్రమంలో భాగంగా,బాలంపేటలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కెజీబీవీ)లో అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..15 సంవత్సరాల వయస్సు గల బాలికలకు ఈ టీకా ఎంతో రక్షణనిస్తుందని పేర్కొన్నారు.అనంతరం పాఠశాలలోని 19 మంది బాలికలకు ఉచితంగా హెచ్‌పిసి టీకాలను వేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ స్నేహ ,హెల్త్ సూపర్‌వైజర్ రఫీ,పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి,ఏఎన్ఎంలు తిరుపతమ్మ,అనిత,మాణిక్యమ్మ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపిడిఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 6,(ప్రభాతవార్త):** మధ్యాహ్న భోజన కార్మికుల సమ్యలు పరిష్కరించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య అన్నారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై జిల్లెడు చౌదరిగూడా మండల ఎంపిడిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రాథమిక పాఠశాల పిల్లలకు రూ.6 రూపాయలు హైస్కూల్ పిల్లలకు రూ.10 రూపాయలు భోజనాల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్నట్లు పెర్కొన్నారు. నిత్యవసర సరుకులు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి మధ్యాహ్న భోజన కార్మికులు సరుకులు కొనలేని పరిస్థితి నెలకొందని అన్నారు. వచ్చే జూన్ నుంచి ఉదయం టిఫిన్ కూడా పెట్టాలని ప్రభుత్వం ప్రతిపాదన తయారు చేసిందని కానీ ఉదయం టిఫిన్ మధ్యాహ్నం భోజనం పెట్టడం ద్వారా ఒక రోజు మొత్తం పని చేయాల్సిన అవసరం వస్తుందని అలాంటప్పుడు ప్రభుత్వమిచ్చే రూ 3వేల గౌరవ వేతనం దేనికి సరిపోదని ఆయన అన్నారు. కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ ఇన్సూరెన్స్ సౌకర్యం కూడా కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఎంపిడిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల గౌరవ అధ్యక్షులు జిల్లెల్ల వెంకటేష్, మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ మండల అధ్యక్ష కార్యదర్శులు ఎండి చోటే మియా, శేఖర్ గౌడ్, నాయకులు రమేష్, శివ, కల లక్ష్మీ, షమీం బేగం మంజుల, సత్తెమ్మ, పార్వతమ్మ, పాల్గొన్నారు.

## సమతుల ఆహారంతోనే ఆరోగ్యం!

**డాక్టర్. అమృత జోసెఫ్**

**కొందుర్గు, ఏప్రిల్ 6, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ సమతులమైన ఆహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారిని అమృత జోసెఫ్ అన్నారు. సోమవారం నాడు ప్రజా పాలన..ప్రగతి ప్రగతి నివేదిక.. 99 రోజుల కార్యక్రమంలో భాగంగా స్థానికబస్టాండ్ ఆవరణలో ప్రాథమిక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఈట్ అండ్ రైట్ భారీ ర్యాలీని మండల పరిషత్ అభివృద్ధి అధికారిని వి.లక్ష్మీ అనురాధ ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ జంక్‌ఫుడ్ తీసుకోవద్దని దానివలన ఆరోగ్యం క్షీణిస్తుంది, అంతేకాకుండా క్యాన్సర్‌కు దారితీస్తుందని ఆమె తెలి పారు.

ప్రతి ఒక్కరు సమతుల ఆహారమైన చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలు, మాంసకృతులు తీసుకుంటే ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌడపురం ప్రభాకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోష్న, పంచాయతీ సభ్యులు, అంగన్వాడి ఆశా కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**మేడ్చల్, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన సంఘటనను మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మేడ్చల్ రైల్వే స్టేషన్ సమీపంలో ఓ వృద్ధుడి మృతదేహన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని పరిశీలించి అతని వయస్సు సుమారు 65 నుండి 70 సంవత్సరాలు ఉన్నట్లు గుర్తించారు. అతని శరీరంపై గాయాలు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించి వివరాలు సేకరించారు.

మృతుడి శరీరంపై లేత రంగు షర్టు, ముగరు రంగు గీతల లుంగీ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.